క్లుప్తంగా

ఉచిత కంటి వైద్య శిబిరం


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు నాగేందర్

డిచ్‌పల్లి: మండలంలోని నడిపల్లి తండా గ్రామంలో ఆదివారం జూనియర్ ఛాంబర్ అఫ్ ఇంటర్నేషనల్ ఇందూరు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు నాగేందర్ ఆధ్వర్యంలో 73 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 13 మందికి మోతిబిందు ఉన్నట్లు గుర్తించారు. వీరిని శస్త్ర చికిత్స నిమిత్తం లయన్స్ కంటి ఆస్పత్రికి నిజామాబాద్‌కు రిఫర్ చేశారు. తండా వాసులకు కంటి సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జేసీఐ కార్యదర్శి కే.జైపాల్, తండా నాయక్, కారోబార్, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపిక


మాలావత్ మమత

సిరికొండ: జాతీయ స్థాయి హాకీ పోటీలకు తూంపల్లి క్రీడాకారిణి మాలావత్ మమత ఎంపికైనట్లు జెడ్పీ హెచ్ఎస్ పీడీ నగేష్ తెలిపారు. గత నెలలో జింఖానా గ్రౌండ్స్‌లో నిర్వహించిన సీనియర్ నేషనల్స్ ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. జాతీయ స్థాయి పోటీలు ఈ నెల 10 వరకు హర్యానాలో జరుగుతాయని ఆయన తెలిపారు. సాయ్ అకాడమీలో శిక్షణ పొందుతున్న మమత జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవ్వడంపై జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు విశాఖ గంగారెడ్డి, కార్యదర్శి రమణ, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

దుద్దిళ్ల శ్రీపాదరావుకు ఘన నివాళి


శ్రీపాదరావు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న జెడ్పీ సీఈవో, సిబ్బంది

నిజామాబాద్ రూరల్: ఉమ్మడి ఏపీ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతిని ఆదివారం జెడ్పీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ సీఈవో సాయాగౌడ్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉప ముఖ్య కార్యనిర్వాహణ అధికారి సాయన్న, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



సిరికొండ: మండల కేంద్రానికి చెందిన ఈర ప్రభాకర్ అనారోగ్యంతో బాధపడుతుండటంతో దువ్వూరి నర్సారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ. 10 వేల ఆర్థిక సాయం చేశారు. సిరికొండకు చెందిన ట్రస్ట్ సభ్యులు డీఎల్ఎన్ రెడ్డి, సంజీవ్‌రెడ్డి, గంగారెడ్డిల తరపున సంతోష్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు నగదును ఆదివారం అందజేశారు. దువ్వూరి భాస్కర్‌రెడ్డి, బాలసాయిలు, విజయ్‌కుమార్, ఆకుల రాజన్న తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వేణురాజ్


వేణురాజ్

నిజామాబాద్ అర్బన్ : రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ ప్రధాన కార్యదర్శిగా నగరానికి చెందిన వేణురాజ్ నియమితులయ్యారు. ప్రస్తుతం వేణురాజ్ ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నాడు. ఈసందర్భంగా వేణురాజ్ మాట్లాడుతు గత ఏడు సంవత్సరాలుగా ఎన్ఎస్‌యూఐలో కష్టపడినందుకు రాష్ట్ర నాయకులు గుర్తించడం సంతోషంగా ఉందన్నారు. ఈనియామకంతో మరింత బాధ్యత పెరిగిందని తెలిపారు.

ఇంటి పన్ను వసూలు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలో ఆదివారం మున్సిపల్ శాఖ సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ ఆస్తి పన్ను వసూలు చేశారు. ఇంటి పన్ను చెల్లించినపుడే కాలనీల్లో అభివృద్ధి పనులు చేపట్టడం సాధ్యమవుతుందని ప్రజలకు అవగాహన కల్పిస్తూ పన్నువసూలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శాఖ అధికారులు ఎల్ శేఖర్, ఎస్ దత్తా రెడ్డి, వెంకటేష్, పీ నాగరాజు, ఏ నర్సయ్య, భాను, శ్రీకాంత్, సిందూజ, పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఓ చోట వృథా.. మరోచోట వ్యథ

- మండలంలో ప్రభుత్వ కార్యాలయాల దుస్థితి
- ఒకవైపు నిర్వహణ లేమి, మరోవైపు నిర్వహణ భారం
- ఇబ్బందుల్లో ఎదుర్కొంటున్న ప్రజలు


ఇందల్వాయిలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన తహసీల్దార్ కార్యాలయం


స్థలం లేక కిందనే ఉంచిన రికార్డులు

ఇందల్వాయి: మండలంలో ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. మండల కేంద్రంలో ఏ ప్రభుత్వ కార్యాలయానికి పక్కా భవనాలు లేక సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నల్లవెల్లి,ఇందల్వాయి,లోలం గ్రామాల్లో నిర్మించిన రైతు వేదికలు వాడుకకు నోచుకోక నిర్వహణ కరువై అపరిశుభ్రతకు నిలయాల్లా మారుతున్నాయి. ఉన్నత స్థాయి అధికారులు,ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యానికి ఈఘటనలు అద్దం పడుతున్నాయి.

అద్దె భారమై..

ఇటీవల మండల కేంద్రంలోని అద్దె భవనంలో ఉన్న తహసీల్దార్ కార్యాలయం నిర్వహణ భారమై నిర్వహణకు ఏమాత్రం అనుకూలంగా లేని పక్కనే ఉన్న డీసీసీబీ భవనంలోని పై అంతస్తులోకి తరలించారు. అక్కడ మూత్రశాలలు లేక, తగినన్ని గదులు లేక విలువైన రెవెన్యు రికార్డులను కిందనే ఉంచుతున్నారు.అధికారులు ఒకే హాలులో ఇబ్బందిగా విధులు నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉండగా పాతిక లక్షలు వెచ్చించి ఆధునిక హంగులతో నిర్మించిన రైతు వేదికల్లో అధికారులు లేక, నిర్వహణ కరువై తలుపులు చెదలు పట్టి ఊడిపోతున్నాయి. కార్యాలయం ప్రాంగణం చెత్త చెదారంతో నిండి పోయి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి.

అన్ని కార్యాలయాలదీ అదే తీరు..

మండలంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఒక్క అటవీ శాఖకి సొంత భవనం ఉన్నా సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఎంపీడీవో కార్యాలయం, పోలీస్ స్టేషన్‌లు సౌకర్యాలు లేని భవనాల్లోనే కొనసాగుతున్నాయి. విద్యా, పోస్టల్, మహిళ సమాఖ్య కార్యాలయాలను చిన్న గదుల్లోనే నెట్టుకొస్తున్నారు.


నల్లవెల్లి రైతు వేదికలో ఊడిపోయిన తలుపు


పిచ్చి మొక్కలతో ఉన్న రైతు వేదిక మూత్రశాల

తహసీల్దార్ కార్యాలయం ఏమాత్రం అనుకూలంగా లేదు



మరో భవనంలోకి మారిన తహసీల్దార్ కార్యాలయం ప్రజలకు,అధికారులకు ఏమాత్రం అనుకూలంగా లేదు.మెట్లు ఎక్కి మొదటి అంతస్తులోకి వెళ్లడానికి వృద్ధులకు, వికలాంగులు ఇబ్బందులు పడుతున్నారు. మూత్రశాలలు లేకపోవడం వల్ల ప్రతి ఒక్కరూ ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల సమీకృత భవనాలను నిర్మించాలి.

– ఆర్.మోహన్ నాయక్,మాజీ సర్పంచ్, జీ.కే.తండా

రైతు వేదికలను వినియోగంలోకి తేవాలి



రైతు వేదికలు పూర్తిగా శిథిలావస్థలోకి చేరాయి. దీంతో లక్షలు వెచ్చించి నిర్మించిన అవి నిరుపయోగంగా మారుతున్నాయి.సరైన పర్యవేక్షణ లేక మందు బాబులకు అడ్డాలుగా మారుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి రైతు వేదికల్లో క్రమం తప్పకుండా రైతులతో సమావేశాలు నిర్వహించి వాటిని పూర్తి స్థాయిలో వినియోగంలోకి తేవాలి. – శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ రైతు మోర్చా మండల అధ్యక్షుడు, ఇందల్వాయి

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా


పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ధర్పల్లి: దమ్మన్నపేట్‌లో రామాలయం అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తానని ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని దమ్మన్నపేట్‌లో నూతనంగా నిర్మించిన రామాలయంలో సీతారాముల, హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే భూపతిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీతారామ, ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఆలయం నుంచి గ్రామం వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, ఆలయ పక్కన కళ్యాణ మండపానికి నిధులు కేటాయించాలని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఎమ్మెల్యేకు విన్నవించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఆర్మూర్ బాలరాజ్, మనోహర్ రెడ్డి, చెలిమెల నర్సయ్య, శేఖర్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

మంచిప్పలో ఘనంగా నల్ల పోచమ్మ బోనాలు


మంచిప్పలో బోనాలతో వస్తున్న గ్రామస్తులు

మోపాల్ : మండలంలోని మంచిప్పలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నల్ల పోచమ్మ బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు బోనాలతో డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు. అంతకు ముందు గ్రామదేవతలైన సార్గమ్మ వద్ద బోనాలకు ప్రత్యేక పూజలు చేశారు. బోనాలను నల్ల పోచమ్మకు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అందరు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడి, పంటలు బాగా పండాలని అమ్మవారిని ప్రార్థించారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వెంకట్రాం నాయక్, రైటర్ గుండుల శ్రీనివాస్, ప్రతినిధులు అశోక్, జగదీష్ యాదవ్, మోహన్‌రెడ్డి, సాయిరెడ్డి, సాయిలు, నర్సారెడ్డి, ప్రవీణ్, సాయిరాం, రాజేష్, శ్రీనివాస్, గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

తాడెంలో ..

మోపాల్: మండలంలోని తాడెంలో బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బోనాలను డప్పు వాయిద్యాలతో ఊరేగించి పెద్దమ్మ, మహాలక్ష్మీ అమ్మవార్లకు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడి పంటలు బాగా పండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని ప్రార్థించామని గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామస్తులు అనంత్‌రెడ్డి, సూర్యారెడ్డి, జలంధర్‌రెడ్డి, గంగారెడ్డి, స్వామి గౌడ్, సుమన్, తదితరులు పాల్గొన్నారు.


తాడెంలో బోనాలకు పూజలు చేస్తున్న మహిళలు

పోచమ్మ తల్లికి..


వినాయక్ నగర్‌లో బోనాలతో మహిళలు

నిజామాబాద్ రూరల్: నగరంలోని వినాయక నగర్ 100 ఫీట్ల రోడ్ వద్ద గల శ్రీ మావురాల రేణుక తల్లి విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా ఆదివారం మహిళలు పోచమ్మ తల్లికి బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో డప్పు వాయిద్యాలు, మేళతాళాల మధ్య బోనాలు తీశారు. సోమవారం రేణుకమాత కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమానికి నందిపేట్ పలుగుట్ట ఆశ్రమ వ్యవస్థాపకులు మంగి రాములు మహరాజ్, మల్లారం లింగేశ్వర గుట్ట ఆశ్రమ వ్యవస్థాపకులు పిట్ల కృష్ణ మహరాజ్‌లు హాజరవుతున్నారని తెలిపారు.

లయన్స్ క్లబ్ సేవలు విస్తరించాలి


మాట్లాడుతున్న లయన్స్ జిల్లా గవర్నర్ నగేష్

నిజామాబాద్‌నాగారం: జిల్లాలో లయన్స్ క్లబ్ సేవలు విస్తరించాలని లయన్స్ జిల్లా గవర్నర్ పంపటి నగేష్ అన్నారు. నగర శివారులోని కమ్మసంఘ భవనంలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ 62వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. లయన్స్ సేవలను మరింతగా విస్తరించాలని సూచించారు. కొత్త వారిని తీసుకువచ్చి సేవా కార్యక్రమాల్లో మమేకం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం చైర్మన్ డి.నర్సింహరాజు, లయన్స్ పూర్వ గవర్నర్లు ప్రకాష్ రావు, లక్ష్మి, పెంటయ్య, బసవేశ్వర రావు, గందాని శ్రీనివాసరావు, ఓబుల్ రెడ్డి, వీటీ రాజ్ కుమార్, వీరేశం, జిల్లా కార్యదర్శి శ్రీధర్, కోశాధికారి మధు, లయన్స్ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ అధ్యక్ష కార్యదర్శులు అవస్ కుమార్, శంకర్, కోశాధికారి జయంత్, రీజియన్ చైర్మన్ అనిల్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

'దొంతులర్ర' పుస్తక ఆవిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు

నిజామాబాద రూరల్ : జిల్లాకు చెందిన కవయిత్రి, ఉపాధ్యాయురాలు డాక్టర్ శారద రచించిన దొంతులర్ర పుస్తకావిష్కరణ హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఆదివారం జరిగింది. తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ, అక్షరయాన్, సీతాస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈకార్యక్రమం నిర్వహించారు. జానపద సాహిత్య పరిషత్ అధ్యక్షులు డాక్టర్ సి వసుంధర రెడ్డి , అభిజ్ఞ భారత్ ఆర్గనైజేషన్ ఫౌండర్ దుంప శ్రీదేవి, నాళేశ్వరం శంకరం, స్వాతి శ్రీపాద, అయినంపూడి శ్రీలక్ష్మి ,రచయిత సాధనాల వేంకటస్వామి చేతుల మీదుగా దొంతులర్ర కవిత్వ సంపుటిని ఆవిష్కరించారు. అక్షరయాన్ కవయిత్రులు, జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు

ఘనంగా ఉమామహేశ్వరస్వామి రథోత్సవం


ఉమామహేశ్వర ఉత్సవ విగ్రహాలను తీసుకెళ్తున్న పురోహితులు


రథోత్సవంలో పాల్గొన్న గ్రామస్తులు

ఎడపల్లి(బోధన్): మండలంలోని కుర్నాపల్లి ఉమామహేశ్వర ఆలయంలో ఆదివారం రథోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు పోటీపడి రథాన్ని లాగారు. రథాన్ని ఆలయ కమిటీ నిర్వాహకులు పూలు, మామిడి తోరణాలతో పాటు ప్రత్యేక విద్యుత్తు అలంకరణతో అందంగా అలంకరించారు. గ్రామంలోని ప్రధాన వీధులలో ఉమామహేశ్వర రథోత్సవం ఊరేగింపు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి పల్లకీ సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సురేందర్ రెడ్డి, గ్రామపెద్దలు రవీందర్ గౌడ్, అనిల్ రెడ్డి, హన్మంత్ రెడ్డి, పరిగే సాయిలు , సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐ టెక్నాలజీపై అవగాహన



పెర్కిట్(ఆర్మూర్): మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ శ్రీ భాషిత పాఠశాలలో ఆదివారం కృత్రిమ మేధస్సు ద్వారా విద్యాభ్యాసంపై విద్యార్థుల తల్లితండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి జిల్లా సైన్సు అధికారి గంగాకిషన్, ఈడోస్ సంస్థ సీఈవో లక్ష్మీ కాంత్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మీకాంత్ మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు ద్వారా విద్యార్థులు పాఠ్యంశాలను విజులైజేషన్ చేసినపుడు ఎల్లకాలం గుర్తిండిపోతాయన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ శ్రీ భాషిత సుందర్, ఉపాధ్యాయునులు, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

విఠల్ సేవలు అభినందనీయం

రుద్రూర్: పోలీస్ వృత్తిలో విఠల్ అందించిన సేవలు అభినందనీయమని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వర్తిస్తూ పదవి విరమణ చేసిన విఠల్‌ను ఆదివారం రుద్రూర్ పోలీస్‌స్టేషన్‌లో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్సై సాయన్న, ఏఎస్సై రాజు,హెడ్ కానిస్టేబుల్ సురేష్, సాగర్, ప్రదీప్, అమీర్, రాజు, గణపతి తదితరులు పాల్గొన్నారు.

పంటలకు సాగు నీరు అందించాలి

- జెడ్పీ మాజీ చైర్మన్ విఠల్‌రావు

నిజామాబాద్ రూరల్ : రాష్ట్రంలో అనేక జిల్లాల్లో పంటలు ఎండిపోతున్నాయని ప్రాజెక్టుల ద్వారా చివరి ఆయకట్టు వరకు నీరు అందించాలని జెడ్పీ మాజీ చైర్మన్ దాదాన్నగారి విఠల్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఇసుక తవ్వకాలు ఎక్కువకావడంతో భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయన్నారు. ఇసుక తవ్వకాలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు ఇవ్వొద్దన్నారు. ఎస్ఎల్‌బీసీ సొరంగంలో మృతి చెందిన కుటుంబాలకు ప్రతి ఒక్కరికి రూ. కోటి సహాయం చేయాలన్నారు. జిల్లాకు ఎయిర్ పోర్టు మంజూరు చేయాలని కేంద్ర విమానయాన శాఖ మంత్రి రాంమోహన్ నాయుడికి లేఖ రాస్తానని తెలిపారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	88,200	వెండి(కిలో)	1,00,500
22 క్యారెట్స్	81,900	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	130
		లైవ్	80
స్కిన్‌లెస్	150	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	8	16	గాజరుగడ్డ	30	50
బెండకాయ	40	80	పచ్చిమిర్చి	25	50
బీరకాయ	40	60	దోసకాయ	30	50
దొండకాయ	30	50	ఆలుగడ్డ	20	40
జిర్రినుకాయ	30	50	గోబిగడ్డ	15	30
కాకరకాయ	40	60	గోబిపువ్వు	20	40
వంకాయ	10	20	బీట్‌రూట్	25	50
పాలకూర	20	40	కరివేపాకు	60	110
మెంతికూర	30	50	చామగడ్డ	40	60
కొత్తిమీర	20	40	గోరుచిక్కుడు	40	60
పుదీనా	40	80	చిక్కుడుకాయ	40	60
క్యాప్సికం	40	60			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	ఛావా(హిందీ)-11.00.4.40,7.30, 10.20 – అగత్యా(తెలుగు)-1.40
స్క్రీన్-2	అగత్యా(తెలుగు)-11.00, 4.40 మజాకా(తెలుగు)-1.45, 7.35,10.30
స్క్రీన్-3	గార్డ్(తెలుగు)-10.50 రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్(తెలుగు)-1.40, 7.30 శబ్దం(తెలుగు)-4.40, 10.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	ఛావా(హిందీ)-10.05 మజాకా(తెలుగు)-1.25 టర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-4.30, 7.40, 10.50
స్క్రీన్-2	మజాకా -10.00,4.15 రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-1.05 ఛావా(హిందీ)-7.20, 10.40
స్క్రీన్-3	రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-9.40 ఛావా(హిందీ)-12.50 తండేల్(తెలుగు)-4.10, 10.20 మజాకా(తెలుగు)-7.15
స్క్రీన్ -4	ఓయ్(తెలుగు)-10.05 జాబిలమ్మ నీకు అంత కోపమా(తెలుగు)-1.30 ఛావా(హిందీ)-4.20 సంక్రాంతికి వస్తున్నాం(తెలుగు)- 7.40 మజాకా(తెలుగు)-10.40
లలితామహల్	తండేల్(తెలుగు)
దేవి	మజాకా(తెలుగు)
నటరాజ్	ఛావా(హిందీ)
విజయ్	సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)

లక్ష్మి కాలువ భూముల ఆక్రమణ

- ఇరిగేషన్ భూమిని కబ్జా చేసిన మాజీ సర్పంచ్
- ప్రభుత్వ భూమిలో మడిగెల నిర్మాణం
- అధికారులు పట్టించుకోవడం లేదు
- బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోష్ ఆరోపణ



ముప్కాల్‌లో మాట్లాడుతున్న సంతోష్

బాల్కొండ: ముప్కాల్‌లో లక్ష్మి కాలువకు సంబంధించిన భూములను మాజీ సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్ కబ్జా చేసి మడిగెలు నిర్మించాడని బీజేవైం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాయకుడు సంతోష్ ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వే నంబరు 70/1, 70/2,70/3 లో గల లక్ష్మి కాలువకు సంబంధించిన ఇరిగేషన్ భూమిలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్ అక్రమంగా మడిగెలు నిర్మిస్తున్నారని మండిపడ్డారు. ఈవిషయమై స్టే ఆర్డర్ తెచ్చుకొని కోర్టును తప్పుదోవ పట్టించాడని విమర్శించారు. అక్రమంగా నిర్మించిన మడిగెలను తొలగించవద్దని స్టే ఆర్డర్‌లో కోర్టు ఎక్కడ పేర్కొనలేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి అండతో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులపై బెదిరింపులకు పాల్పడుతున్నాడని అన్నారు. మాజీ సర్పంచ్ నూతనంగా నిర్మించిన మణికంఠ ఫంక్షన్ హాల్‌కు సైతం ఎలాంటి అనుమతులు లేవన్నారు. ఫంక్షన్ హాల్ వ్యర్థాలను ప్రభుత్వ భూమిల్లోనే వేస్తున్నాడన్నారు. అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలను తొలగించకుంటే భవిష్యత్తులో అధికారులపై చర్యలు తీసుకోనేలా కోర్టును ఆశ్రయిస్తానని తెలిపారు. ముప్కాల్‌లో భూ కబ్జాలను వెంటనే అరికట్టాలని డిమాండ్ చేశారు.

జోరుగా మొరం అక్రమ రవాణా

రుద్రూర్: మండలంలోని అక్బర్‌నగర్ శివారులో గుట్ట ప్రాంతం నుంచి అక్రమార్కులు రాత్రి మొరం వేళ తరలిస్తున్నారు. జేసీబీల ద్వారా తవ్వకాలు జరిపి ప్రైవేటుగా మొరం అమ్మకాలు జరుపుతున్నారు. మొరం అక్రమ రవాణాపై ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో జాతీయ రహదారి పనులు కొనసాగుతున్నాయి. ఇందు కోసం సాయంత్రం వరకు మొరం తరలించుకోవడానికి అవకాశం ఉన్నా.. రాత్రి వేళ తరలించడంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించాలని కోరుతున్నారు. ఈ విషయమై రెవెన్యూ, మైనింగ్ అధికారులను ఫోన్ ద్వారా సంప్రదించగా వారు స్పందించలేదు.

కోటగిరిలో బస్టాండ్ నిర్మించాలి


కోటగిరిలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలో బస్టాండ్ నిర్మించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం కోటగిరి మండల కేంద్రంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బస్టాండ్ లేకపోవడంతో వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా మూత్రశాలలు లేనందున మహిళలు అవస్థలు పడుతున్నారు. గతంలో పలుమార్లు అధికారులు విన్నవించినప్పటికి ఫలితం లేదని వాపోయారు. సమస్య పరిష్కరించనట్టయితే దశల వారీగా ఉద్యమం చేపడుతామని వారు హెచ్చరించారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి విఠల్ గౌడ్, పార్టీ నాయకులు నల్ల గంగాధర్, గుడాల వీరేశం, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.